వాళ్ళు ముగ్గురూ మరోసారి మఠాధికారికి తమ కృతజ్ఞతలని ఒంగి, ఒంగి తెలియచేసుకున్నారు. తిరిగి మఠాధికారి పడవ మీద తమ ఓడని చేరుకున్నాడు. జరిగింది దర్పంగా కెప్టెన్‌కి వివరించాడు. ఓడ తిరిగి బయలు దేరింది. కొద్ది మైళ్ళు ఓడ ప్రయాణించే దాకా మఠాధికారి ఆ ద్వీపం వంక చూస్తూండిపోయాడు. 'సాక్షాత్తు ఆ నారాయణుడే తనని వాళ్ళ దగ్గరకి మంత్రోపదేశానికి పంపించి ఉంటాడు. లేకపోతే వాళ్ళ జన్మలు వృధా అయేవి' అనుకున్నాడు ఆయన.

అకస్మాత్తుగా ఆ మఠాధికారికి దూరంగా సముద్రం మీద ద్వీపం వైపు నించి ఏదో కదులుతూ కనపడింది. ఆయన అది ఏమిటా అని దీక్షగా చూడసాగాడు. చూస్తూండగానే ద్వీపంలోని ముగ్గురిలోని పొట్టి శిష్యుడు నీళ్ళ మీద పరుగెత్తుకుంటూ ఓడ వైపు రావడం కనిపించింది. మఠాధికారికి మతి పోయినట్లయింది. ఆ శిష్యుడు ఓడ దగ్గరకి చేరుకోగానే గాల్లో, కనపడని మెట్లమీద నడిచినట్లుగా డెక్ మీదకి చకచక నడిచి వచ్చి మఠాధికారికి నమస్కరించి చెప్పాడు.

"మమ్మల్ని క్షమించమని మా గురువు గారు చెప్పి పంపారు. మందమతులం కాబట్టి మంత్రం మర్చిపోయాం. ఓ సారి దాన్ని గుర్తుచేస్తారా?"

మఠాధికారిలోని దర్పం అణగడంతో లేచి అతనికి నమస్కరించి చెప్పాడు.

"మీకు ఏ మంత్రం అవసరం లేకుండానే దైవానుగ్రహం లభించింది. మీరు ధన్యులు."

## 106. నిజాయితీ

ఆ రోజు శనివారం. అమలాపురంలో సర్కస్ కేంప్ వేసింది. వెంకటేశ్వర రావు తన ఇద్దరు పిల్లలని ఆ సర్కస్‌కి సాయంత్రం అయిదున్నరకి తీసుకువచ్చాడు. ఆరుకి షో మొదలవుతుంది. టికెట్ కౌంటర్ ముందు క్యూలో నిలబడ్డాడు. పిల్లలిద్దరూ కళ్ళింత చేసుకుని సర్కస్ పోస్టర్లని చూస్తున్నారు. తన వంతు రాగానే వెంకటేశ్వర రావు అడిగాడు.

"పిల్లలిద్దరికీ కూడా టిక్కెట్లు తీసుకోవాలా?"

"ఆరేళ్ళు లోపు పిల్లలకి ప్రవేశం ఉచితం. వీళ్ళ వయసెంత?" అడిగాడు టికెట్ కౌంటర్‌లోని మళయాళం అతను ఇంగ్లీష్‌లో.

"చిన్నవాడి వయసు నాలుగు. పెద్దవాడి వయసు ఏడు. కాబట్టి రెండు టిక్కెట్లు ఇవ్వండి." డబ్బిస్తూ చెప్పాడు వెంకటేశ్వర రావు.

టిక్కెట్లిచ్చి నవ్వుతూ అడిగాడు అతను.

"మీ పెద్దబ్బాయి వయసు ఆరంటే నేను నమ్మేవాణ్ణి. బర్త్ సర్టిఫికేట్ అడగం అని మీకూ తెలుసు. మరి మీకు ముప్పై రూపాయలు మిగిలేది కదా?"

"నిజమే. అబద్ధం చెప్తే మీరు కనుక్కోలేరు. కాని నా కొడుక్కి నేను అబద్ధం ఆడానని తెలుస్తుంది. వాడు నిజాయితీగా జీవించాలని నా కోరిక." వెంకటేశ్వర రావు అతనికి జవాబు చెప్పాడు.

## 107. హెచ్చరిక

చావంటే భయం గల ఒకతను యముడి గురించి ఘోర తపస్సు చేసాడు. కొంతకాలానికి అతనికి యమధర్మరాజు ప్రత్యక్షం అయి 'ఏం కావాలో కోరుకో' అనగానే అతను ఇలా అడిగాడు.

"స్వామి! నేను ఎన్నటికీ చావని వరం ఇవ్వు."

"అదెలా సాధ్యం? పుట్టాక ఎవరైనా చావక తప్పదు. కాకపోతే నీ చావుకి మునుపు నీకు నాలుగుసార్లు చావు రాబోతోందని గుర్తు చేస్తాను. దానివల్ల నీ పనులన్నీ నువ్వు చక్కబెట్టుకోవచ్చు."

"సరే స్వామి."అందుకు ఒప్పుకున్నాడు అతను.

కొంతకాలానికి జ్వరం వచ్చి అతను మంచం మీద పడ్డాడు. మర్నాడు యముడు అతని ప్రాణాలని తీసుకువెళ్ళడానికి వచ్చాడు. యముడ్ని చూసి ఆశ్చర్యపోతూ అడిగాడు అతను.

"ఇదన్యాయం స్వామి! నువ్వానాడు ఇచ్చిన వరం ప్రకారం నాకు నాలుగు సార్లు చావు దగ్గరకి వచ్చిందనే హెచ్చరిక చేస్తానన్నావు. మరి మాట తప్పావే? నేను చేయాల్సిన పనులు చాలా మిగిలిపోయాయి."